క్లుప్తంగా

గ్రీవెన్స్ సెల్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారం



మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: మండలంలోని వివిధ గ్రామాల ప్రజల నుంచి గ్రీవెన్స్ సెల్‌కు వచ్చిన వినతులను పరిష్కరించడానికి చర్యలు చేపడుతున్నామని తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎస్సై ఎం.రాజేష్ అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి వివిధ శాఖల ద్వారా వచ్చిన వినతులను మండలంలోని అధికారులకు పరిష్కారం నిమిత్తం అందజేసినట్లు తెలిపారు. పోలీస్, రెవెన్యూ పరంగా వచ్చిన వినతిపత్రాలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో హెచ్ఎం మృతి



ఎం.జగబంధు(ఫైల్)

బలిజిపేట: మండలంలోని గంగాడ డీపీఈపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.జగబంధు గురువారం తెల్లవారుజామున బొబ్బిలిలో గుండెపోటుతో హఠాత్తుగా మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన పార్థివ దేహాన్ని ఎంఈఓ-1సామల సింహాచలం సందర్శించి, కుటుంబసభ్యులను పరామర్శించి శాఖాపరంగా అన్ని విధాలా సహకరించనున్నట్లు అభయమిచ్చారు. ఆయన మృతిపట్ల ఉపాధ్యాయులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

178మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది

బలిజిపేట: మండలంలోని అరసాడలో డాక్టర్స్ ప్లాజా, ఎన్నారై హాస్పిటల్స్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 178మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఎన్నారై హాస్పిటల్ వైద్యులు గైనిక్, జనరల్ వ్యాధులు, ఆర్థోపెడిక్ సంబంధిత తనిఖీలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు అభినవ్, మాధురి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా అమ్మవారి జాతర



గ్రామంలో ఘటాలతో తిరువీధి చేస్తున్న భక్తులతో పూజారి


సీతానగరం: మండలంలోని బూర్జలో పెద్దమ్మవారి జాతరను పురస్కరించుకుని అమ్మవారి ఘటాలకు డప్పువాయిద్యాలతో తిరువీధి జరుగుతోంది. వారం రోజులుగా ఉత్సవాలు జరుగుతున్నాయి. బూర్జలో చిన్న పిల్లలు సైతం ఘటాలను నెత్తిన పెట్టుకుని తిరువీధిలో పాల్గొనడం విశేషం.

రైతులకు ఇబ్బందులు లేకుండా ట్రెంచ్‌లు తీస్తాం



మాట్లాడుతున్న అటవీశాఖ రేంజర్ బి.రామ్‌నరేష్

సీతానగరం: మండలంలోని పేదల భూములకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ఇక్కడికి కుంకి ఏనుగులను తీసుకువచ్చి మచ్చిక చేసే ఏర్పాటు కొనసాగుతుందని అందు కనుగుణంగా ట్రెంచ్ పనులు జరుగుతున్నాయని అటవీశాఖ రేంజ్ అధికారి బి. రామ్‌నరేష్ అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని అప్పయ్యపేటలో నిర్దేశించిన గ్రామాల వారితో పాటు రైతుసంఘం, సీపీఎం జిల్లా నాయకులతో గురువారం కుంకి ఏనుగుల జోన్ ఏర్పాటుపై అఖిలపక్ష కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న రేంజర్ బి.రామ్‌నరేష్ మాట్లాడుతూ కొండల్లో పంట సాగుభూములకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనులు కొనసాగిస్తామని తెలియజేశారు. కుంకి ఏనుగులను తెచ్చి ఇక్కడ మచ్చిక చేసే ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు ఎం.కృష్ణమూర్తి, రెడ్డివేణు, రైతు సంఘం నాయకులు పి.శ్రీనునాయుడు, కె మన్మథరావు, భాస్కరరావు, కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.సూర్యనారాయణ, రెడ్డి ఈశ్వరరావు, గవర వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



వడదెబ్బతో జాగ్రత్త

- ముదురుతున్న ఎండలు
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న వైద్యులు

బలిజిపేట: మండుతున్న ఎండల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎండలో ఎక్కువగా గడిపితే డీహైడ్రేషన్(శరీరంలో నీటి శాతం తగ్గడం), డయేరియా (విరేచనాలు), వడదెబ్బ తదితర సమస్యలతో ఇబ్బందిపడాల్సి వస్తుంది. వడదెబ్బకు ప్రాథమికంగా నీరే ప్రాణాధారం, సాధ్యమైనంతవరకు కొబ్బరి నీరు తీసుకోవాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

ఎండలో పనిచేస్తే..

ప్రజలు వేసవికాలంలో వీలైనంతగా పని చేయకుండా ఉండడం మంచిది. ఉదయం, సాయంత్రం మాత్రమే పనులు చేసుకోవడం మేలు. ఎండలో ఎక్కువసేపు పనిచేస్తే చర్మం పొడి బారడం, కళ్లు ఎరుపెక్కడం, ఒళ్లు మంటలు, ఒళ్లునొప్పులు వస్తాయి. ఒక్కోసారి అపస్మారక స్థితిలోకి వెళ్లే అవకాశం ఉంది. ఇలాంటి తరుణంలో వడదెబ్బకు గురైన బాధితులను శీతల ప్రాంతంలో ఉంచి చల్లని గాలి తగిలేలా చూడాలి. శరీరాన్ని తడివస్త్రంతో బాగా తుడవాలి. ఉష్ణోగ్రత ప్రభావం తగ్గిన పక్షంలో సమీపంలో ఉన్న పీహెచ్‌సీకి తరలించాలి.



పుచ్చకాయలు విక్రయిస్తున్న మహిళ

వడదెబ్బకు చికిత్స

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ఉన్న ప్రదేశానికి చేర్చాలి.
- ఐస్ నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం బాగా తుడవాలి.
- ఉప్పు, కలిపిన మజ్జిగను తాగించాలి. లేనిపక్షంలో గ్లూకోజు, ద్రావణం తాగించాలి.
- వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించరాదు

వేసవిలో చేయకూడనివి:

- మధ్యాహ్న సమయంలోని మండుటెండల్లో ఎక్కువగా తిరగరాదు.
- మద్యం తాగరాదు.
- రోడ్ల మీద విక్రయించే చల్లని రంగు పానీయాలు(కూల్‌డ్రింక్స్) తాగరాదు.
- ఈగలు, దుమ్ము ధూళి పడిన, కలుషితమైన ఆహారం తినకూడదు.
- భోజనం అతిగా తినకూడదు.
- ఇంటి పరిసరాల్లో చెత్త నిల్వ ఉంచుకోకూడదు

ఈ సూచనలు పాటిస్తూ వేసవి తాపానికి గురికాకుండా ఉంటే ప్రాణాంతకంగా మారే ప్రమాదాలు సంభవించవని వైద్యులు సూచిస్తున్నారు..





సీతానగరం: సైకిల్‌పై వెళ్తున్న ప్రయాణికుడు. (ఇన్‌సెట్లో) బస్సు కోసం తలకు తువ్వాలు వేసుకుని వెళ్తున్న వృద్ధుడు

తలకు వస్త్రాలు ధరించి పాదచారులు

సీతానగరం: విధిలేని పరిస్థితిలో గురువారం మధ్యాహ్నం 1 గంట సమయంలో మండుటెండను లెక్క చేయక పలువురు రాకపోకలు సాగించారు. మండలకేంద్రంలోని రాష్ట్ర రహదారిపై పాదచారులు, రాష్ట్రరహదారిపై పలువురు ప్రయాణికులు అంత ఎండలోనూ తమ గమ్యానికి చేరుకునేందుకు నడిచివెళ్లారు.

వేసవిలో చేయవలసిన పనులు

- నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీరు, మజ్జిగ ఎక్కువ తీసుకోవాలి
- రోజుకు కనీసం 15గ్లాసుల నీటిని తాగాలి
- పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి
- రోజూ రెండు పూటలా స్నానం చేయాలి
- భోజనం మితంగా చేయాలి
- లేత వర్ణం, తేలికైన కాటన్ దుస్తులు ధరించాలి
- నిదురించే సమయంలో దోమతెరలు వాడాలి
- బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు తీసుకువెళ్లాలి
- చల్లని ప్రదేశంలో ఉండేందుకు ప్రయత్నించాలి
- తాజా కాయగూరలు ఎక్కువగా తీసుకోవాలి

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



ప్రత్యేకాధికారి నాగదుర్గ

మక్కువ: మండలంలోని కాశీపట్నం గ్రామంలో గల కేజీబీవీలో ఆరవతరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేకాధికారి జి. నాగదుర్గ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె పాఠశాలలో విలేకరులతో మాట్లాడుతూ 2025-26 విద్యాసంవత్సరంలో పాఠశాలలో బాలికల ప్రవేశానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని చెప్పారు. ఈ నెల 22వతేదీ నుంచి వచ్చేనెల 11వ తేదీ దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. అలాగే 7,8,9వ తరగతి విద్యార్థులు పాఠశాలలో ప్రవేశానికి కూడా దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. బడిబయట పిల్లలు, అనాథలు, మధ్యలో చదువు మానేసిన విద్యార్థులు, ఎస్టీ,ఎస్సీ, బీసీ దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్న బాలికలకు మొదటప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వివరించారు. ఏపీకేజీబీవీ, ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత ప్రింట్‌కాపీతో పాటు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, స్టడీసర్టిఫికెట్ జిరాక్స్‌లు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో జతచేసి కేజీబీవీ పాఠశాలలో సమర్పించాలని ఆమె పిలుపునిచ్చారు.

బాల్య విద్యకు ప్రాముఖ్యం కల్పించాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ సులేఖ

బలిజిపేట: బాల్యవిద్యకు ప్రాధాన్యం కల్పించేందుకు నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణను అంగన్వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని సీడీ పీఓ సులేఖ తెలిపారు. ఈ మేరకు బలిజిపేటలోని వెలుగు కార్యాలయంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. బాల్య విద్య ప్రాముఖ్యం, బోధన అభ్యసన, సాధన సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. బాల్యంలో విద్యను వారికి ఏవిధంగా బోధించాలి, అందుకు అవసరమైన మెటీరియల్ ఏ విధంగా వినియోగించుకోవాలి, ప్రాథమిక విద్యకు అందివచ్చే సరికి ఏవిధంగా తర్ఫీదు ఇవ్వాలనేది వివరంగా శిక్షణలో తెలియజేయనున్నట్లు చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల్లో బోధించే విధానానికి ఎఫ్ఎల్ఎన్ శిక్షణ ఏవిధంగా ఉపయోగపడుతుందో వివరించారు. కేంద్రాల నిర్వహణలో పాటించాల్సిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కోటదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం





అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న రంగునాయుడు, అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మక్కువ: మండలకేంద్రం మక్కువలోని జన్నివీధిలో కొలువైన కోటదుర్గమ్మ ఆలయం వార్షికోత్సవాన్ని భక్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు కోటదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, జన్నివీధి వాసులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మండలంలోని డబ్బూరివలస, కొండపేట, శాంతేశ్వరం గ్రామాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారికి పూజలు చేశారు.

ఆలయం వద్ద అలన్నసమారాధన కార్యక్రమం నిర్వహించగా రంగునాయుడు భక్తులకు ప్రసాదాన్ని వడ్డించారు.

చెత్తాచెదారం తొలగించి ప్రజల ఆరోగ్యం కాపాడండి

బలిజిపేట: మండలంలోని అంపావల్లిలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, దుర్గంధం వెదజల్లుతున్న వీధికాలువలలో పూడికను తొలగింపజేయాలని కోరుతూ సీపీఎం నాయకులు పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు ఆర్.వేణు, శాఖ కార్యదర్శి సాంబమూర్తి, మండల నాయకుడు మన్మథరావులు మాట్లాడుతూ గ్రామంలోని వీధి కాలువల్లో పేరుకుపోయిన చెత్తచెదారాలను తొలగించకపోవడంతో దోమల బెడద ఎక్కువగా ఉందన్నారు. కనీసం బ్లీచింగ్ అయినా జల్లలేదని, గ్రామంలో ఉండాలంటే దుర్గంధం వెదజల్లుతోందని, వ్యాధులు సోకేందుకు పూర్తిస్థాయిలో అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గౌరునాయుడు, విశ్వేశ్వరరావు, శివరాం, గణపతి, సత్యం, సన్యాశినాయుడు పాల్గొన్నారు.

అంబేడ్కర్ గురుకులాల ప్రవేశపరీక్ష వాయిదా వేయాలి



కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

పార్వతీపురంటౌన్: అంబేడ్కర్ గురుకులాల ప్రవేశ పరీక్షను వాయిదా వేయాలని విశ్వ హిందూ పరిషత్ సభ్యుడు తాళ్లబత్తుల శ్రీను డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ గురుకులాలలో ఐదోతరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షలు ఏప్రిల్6న నిర్వహిస్తున్నట్లు నోటిఫికేషన్ విడుదల చేశారని, అదే రోజు శ్రీరామనవమి జరుగుతుందన్నారు. హిందువులంతా భక్తిశ్రద్ధలతో శ్రీరాముని పూజా కార్యక్రమాలు చేసుకుంటూ భక్తిలో నిమగ్నమై ఉంటారని, ఈ కారణంగా ప్రభుత్వం ముందుగా ఖరారు చేసిన తేదీలను మార్చాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరషత్ సభ్యులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో రూ.పదివేల జరిమానా

పాచిపెంట: మండలంలో డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ఒక్కొక్కరికి రూ.పదివేల జరిమానాను జేఎఫ్‌సీఎం మెజిస్ట్రేట్ కనకలక్ష్మి విధించినట్లు ఎస్సై వెంకటసురేష్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ, నలుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి పదివేల రుపాయలు చొప్పున రూ.40 వేలు జరిమానా విధించారన్నారు.రెండవ సారి డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికితే 3 నెలల జైలు శిక్ష విధించనన్నట్లు మెజిస్ట్రేట్ హెచ్చరించారని ఎస్సై చెప్పారు.

ఘనంగా ముడుపుల పూజలు



కనకాంబరం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖినదీ తీరాన వేంచేసిన లక్ష్మీనృసింహస్వామి వారికి ముడుపుల పూజలు గురువారం ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకుడు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ లోక కల్యాణార్థం దూర ప్రాంతాలనుంచి వందలాది మంది భక్తులు ఇక్కడికి వచ్చి ముడుపుల పూజల్లో పాల్గొంటున్నారని తెలియజేశారు. ముడుపుల పూజలతో పాటు అభిషేకాలు, పూజలు ప్రతి గురువారం జరుగుతున్నాయని చెప్పారు. అలాగే స్వామివారిని దర్శించుకునేందుకు దూరప్రాంతాల నుంచి భక్తులు ఉదయం 5 గంటలకు వచ్చి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఆలయ ప్రాంగణంలో క్యూకట్టి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారని అర్చకుడు తెలియజేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



గెలుపొందిన విద్యార్థులతో ఎంఈవోలు సత్యనారాయణ, శ్యామ్‌సుందర్, ఉపాధ్యాయులు

మక్కువ: కలెక్టర్ ఆదేశాల మేరకు, ఎంపీడీవో డీడీ.స్వరూపరాణి ఆధ్వర్యంలో మక్కువ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి వ్యాచరచన పోటీలను నిర్వహించారు. మండలంలోని అన్ని జిల్లాపరిషత్ పాఠశాలలకు చెందిన 8,9వ తరగతులు చదువుతున్న 24మంది విద్యార్థులు ఆంధ్రప్రదేశ్‌లో పేదరిక నిర్మూలన, పబ్లిక్, ప్రైవేట్ పీపుల్ పార్టిసిపేషన్ అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో పాల్గొన్నారు. ఈ పోటీలో మక్కువ జిల్లాపరిషత్ పాఠశాలకు చెందిన 9వతరగతి విద్యార్థిని యాసి చందనకు ప్రథమ స్థానం, అనసభద్ర ఏకలవ్యపాఠశాలకు చెందిన బి.ఒబామాకు ద్వితీయస్థానం, కాశీపట్నం కేజీబీవీకి చెందిన 9వతరగతి విద్యార్థిని ఎం.సుజాత తృతీయస్థానంలో నిలిచారు. గెలుపొందిన విజేతలను ఎంఈవోలు పెంట సత్యనారాయణ, డి.శ్యామ్‌సుందర్, హెచ్ఎం మజ్జి హేమలత అభినందించారు.

గిరిజనుల జీవితాలతో కూటమి ఆటలు

పార్వతీపురం రూరల్: కూటమి ప్రభుత్వం గిరిజనుల జీవితాలతో ఆడుకుంటోందని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ మండిపడ్డారు. ఈ మేరకు కూటమి పాలనలో గిరిజనులను బతకనివ్వరా అంటూ గురువారం ఆయన విలేకరుల సమావేశంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చి పార్వతీపురం మండలంలో బడిదేవర కొండ తవ్వకాలు చేసి భవిష్యత్‌లో గిరిజనులకు బతుకు లేకుండా కూటమి ప్రభుత్వం చేస్తోందని దుయ్యబట్టారు. సీతానగరం మండలం అప్పయ్యపేటలో కూడా గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చిన చోట ఎలిఫెంట్ జోన్ పేరిట కందకాలు తవ్వి పట్టాలున్న గిరిజనుల భూములను లాక్కోవాలని చూడడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజనులకు బతుకులేకుండా చేస్తున్న కూటమి ప్రభుత్వం పాలన తీరును మార్చుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. తీరు మారకపోతే రానున్న రోజుల్లో గిరిజన వ్యతిరేక విధానాలపై ధర్మ, న్యాయ పోరాటాలు తప్పవని స్పష్టం చేశారు.

భారత్ గ్యాస్ బాధితుల సమస్యలు పరిష్కరించండి



డీఆర్ఓ హేమలతకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పార్వతీపురం టౌన్: భారత్ గ్యాస్ బాధితుల సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వి.దాలినాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్ఓ హేమలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని సారికవీధి వద్ద గల భారత గ్యాస్ కార్యాలయం సుమారు 25రోజులుగా తెరవకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మూడు వారాలుగా దాదాపు 800మంది వినియోగదారులు గ్యాస్ కావాలని ఇండెంట్ పెట్టుకున్నప్పటికీ వారికి గ్యాస్ సరఫరా చేయడం లేదని, నిత్యవసరమైన గ్యాస్ సరఫరా లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా లోని గెడ్డతిరువాడ, చినబొండపల్లి, వల్లరగడబ, కందిరివలస తదితర ప్రాంతాలకు చెందిన వినియోగదారులు రోజూ ఖాళీ గ్యాస్ బండలతో కార్యాలయానికి రావడం, కార్యాలయం మూసి ఉండడంతో నిరాశతో తిరుగు ప్రయాణిస్తున్నారన్నారు. కనీసం సమాధానం చెప్పడానికి కార్యాలయ సిబ్బంది, ప్రతినిధులు లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. భారత్ గ్యాస్ వినియోగ దారులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తీళ్ల గౌరీశంకరరావు, కోల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనకు కఠిన చర్యలు



వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: విశాఖరేంజ్ పరిధిలో గడిచిన 8నెలల్లో గంజాయి నిర్మూలనకు సమూల మార్పులు తీసుకువచ్చామని, గంజాయి అక్రమ ఆస్తుల సంపదను జప్తు చేస్తామని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి హెచ్చరించారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల పోలీసులు వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయిని శ్రీకాకుళం జిల్లా పాతకుంకాం గ్రామ పరిధిలో ఉన్న రెయిన్ బో ఇండస్ట్రీ వద్ద డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న పార్వతీపురం ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించి కొమరాడ, సాలూరు, పాచిపెంట, బత్తిలి, పార్వతీపురం స్టేషన్ల పరిధిలో 48 కేసుల్లో పట్టుబడిన 875.189 కేజీల గంజాయిని ధ్వంసం చేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు గాలం



మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

పార్వతీపురం: కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రవేశాల కోసం విద్యార్థుల తల్లిదండ్రులకు గాలం వేస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. రవికుమార్ పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతూ పదోతరగతి పరీక్షలకు ముందస్తు అడ్మిషన్లు చేయించుకుంటున్నాయని దుయ్యబట్టారు. నేరుగా ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు కరపత్రాలు ఇచ్చి ప్రలోభాలకు గురిచేసి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ధ్వజమెత్తారు. అడ్మిషన్లు చేయించుకుని ఫస్ట్‌టెర్మ్ ఫీజులంటూ, పుస్తకాలు కొనుగోలు అంటూ డబ్బులకు డిమాండ్ చేస్తున్నారన్నారు. ఎన్నిమార్లు విద్యార్థి సంఘాలు జిల్లా విద్యాశాఖాధికారులకు తెలియపరిచినా నిమ్మక నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

ప్రజల సహకారంతోనే సారా నిర్మూలన సాధ్యం



సాలూరు: మాట్లాడుతున్న అధికారులు



పార్వతీపురం రూరల్: తాళ్లబురిడిలో నవోదయం 2.0 కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎక్సైజ్ అధికారులు

సాలూరు: ప్రజలందరి సహకారంతోనే సారా మహమ్మారి సమూల నిర్మాలన సాధ్యమవుతుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ విజయనగరం, పార్వతీపురం జిల్లాల డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీవీఎన్ బాబ్జీరావు అన్నారు. నవోదయం 2.0లో భాగంగా గురువారం సాలూరు మండలంలోని మరిపల్లి గ్రామంలో సారావల్ల కలిగే అనర్థాలపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, సారాకు దూరంగా ఉండాలని తెలిపారు. ఎక్కడైనా సారా క్రయ విక్రయాలు, రవాణా జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే ప్రొహిబిషన్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సూపరిండెంట్ శ్రీనాథుడు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్‌కిశోర్, ఎక్సైజ్ సీఐ దాసు తదితరులు పాల్గొన్నారు.

సారా జోలికి వెళ్తే కఠిన చర్యలు

పార్వతీపురం రూరల్: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు పార్వతీపురం మండలంలోని తాళ్లబురిడి గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు, సూపరింటెండెంట్ వి. శ్రీనాథుడు, అసిస్టెంట్ సూపరింటెండెట్ జీవన్ కిశోర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతూ సారా జోలికి వెళ్తే కఠిన చర్యలు తప్పవని, విక్రయాలు మానివేయాలని ప్రభుత్వం ద్వారా జీవనోపాధి కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. చట్టాన్ని అతిక్రమించి అక్రమంగా సారా తయారీ, రవాణా, విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుని పీడీ యాక్ట్ ద్వారా అరెస్టులు తప్పవని తెలియజేశారు. సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు.

మత్తు జోలికి వెళ్లొద్దు



కళాశాల విద్యార్థులతో మాట్లాడుతున్న పోలీసులు

పార్వతీపురం రూరల్: సమాజాన్ని నిర్వీర్యం చేసే మాదక ద్రవ్యాల జోలికి పోవద్దని పట్టణ శివారులో ఉన్న జ్యోతి ఐటీఐ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పోలీసులు కళాశాల విద్యార్థులకు హితవు పలికారు. కార్యక్రమంలో పోక్సో, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ శక్తి యాప్ వినియోగంపై తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులను ఉద్దేశించి పోలీసులు మాట్లాడుతూ యువతతో దేశాభివృద్ధి సాధ్యమని, అటువంటి యువత ఒత్తిడి, సినిమాలు, ఇతర ప్రచార మాధ్యమాలకు ప్రభావితమై మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతుండడం విచారకరమని, ఒత్తిడిని జయించేందుకు అనేక మార్గాలను యువత ఎంచుకుని అనేక రంగాల్లో రాణించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో పార్వతీపురం శక్తి యాప్ బృందం సభ్యులు ఏఎస్సై పి.శ్రీనివాసరావు, ప్రభాకరరావు, నిర్మల, పద్మ, చైతన్యదేవి, తదితర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.